30 పడకల ఆస్పత్రి పనులు ముమ్మరం

- ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు
- 24 గంటలూ అందుబాటులో వైద్య సేవలు

మునిపల్లి(అందోల్): కంకోల్ గ్రామ సమీపంలో 30 పడకల ఆస్పత్రి పనులు జోరందుకున్నాయి. దీంతో మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 65వ జాతీయ రహదారి సమీపంలో రోగులకు, అత్యవసర సేవలు, ప్రథమ చికిత్సలు గర్భిణులు, బాలింతలకు ఉపయోగంగా ఉండేందుకు ఆస్పత్రి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. వినియోగంలోకి వస్తే 24 గంటలూ వైద్య సేవలు, డాక్టర్లు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేయనున్నట్లు మంత్రి దమోదర రాజనర్సింహ్మ తెలిపారు. 2024 ఫిబ్రవరి 11న ఆరోగ్య శాఖ మంత్రి రాజనర్సింహ్మ ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆస్పత్రి వినియోగంలోకి వస్తే 20 గ్రామాలకు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయి. ప్రత్యేకంగా ల్యాబ్, మందుల పంపిణీకి గదులను నిర్మిస్తున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లకుండా ప్రభుత్వం అన్ని సౌకర్యాలతో ఆస్పత్రిని ఏర్పాటు చేస్తోంది.

మునిపల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

మండల కేంద్రం మునిపల్లిలో అప్పట్లో ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసింది. ఆయా గ్రామాల్లో రోగులకు చికిత్సలు, మందులు పంపిణీ చేయడానికి 8 సబ్ సెంటర్లను ఏర్పాటు చేసింది. సబ్ సెంటర్లలో సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లను నియమించి వైద్య సిబ్బందితో గర్భిణీ, బాలింతలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా సిబ్బందిని సంబంధిత అధికారులు ఏర్పాటు చేశారు. కొన్ని గ్రామాల్లో సబ్‌సెంటర్లకు సొంత భవనాలు ఏర్పాటు చేయగా మిగతా గ్రామాల్లో అద్దె భవనాల్లో కొనసాగుతోంది. పెద్దలోడి, బుస్సారెడ్డి పల్లి గ్రామాల్లో సొంత భవనాలు ఏర్పాటు చేయగా మిగతా ఆరు సబ్‌సెంటర్లు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి.



కంకోల్‌లో కొనసాగుతున్న ఆస్పత్రి పనులు

క్లుప్తంగా

ఏఐటీయూసీ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ క్రాంతి ఏఐటీయూసీ డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అనంతరం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిని ప్రసాద్ మాట్లాడుతూ.. కార్మిక విభాగంలో 105 సంవత్సరాల చరిత్ర కలిగిన ఒకే కార్మిక సంఘం ఏఐటీయూసీ అని తెలిపారు. స్వాతంత్ర్యం రాకముందే కార్మికుల సంక్షేమం కోసం బ్రిటీష్ వాళ్ళతో పోరాటం చేసి కార్మిక చట్టాలను సాధించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సాయిలు, సహాయ కార్యదర్శి ప్రవీణ్, శివశంకర్, శ్రీకాంత్, శంకరప్ప, రమేష్, భగత్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



శంకర్‌ను సన్మానిస్తున్న కాలనీ పెద్దలు

నారాయణఖేడ్: ఖేడ్ జంట గ్రామం మంగల్‌పేట్‌లోని 2,3,4 వార్డుల్లో సీసీ రోడ్ల పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఆయా వార్డుల్లోని మెజార్టీ అంతర్గత రోడ్లను సీసీరోడ్లుగా నిర్మిస్తున్నారు. గురువారం 4వ వార్డులోని పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ పరిశీలించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని గుత్తేదారుకు సూచించారు. అనంతరం కాలనీవాసులు ఆయనను శాలువాలతో సన్మానించారు.

పన్ను వసూలుపై ప్రత్యేక దృష్టి

జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా



నర్సరీని పరిశీలిస్తున్న సాయిబాబా

హత్నూర (సంగారెడ్డి): వందశాతం ఆస్తి పన్ను వసూలు చేసేలా గ్రామపంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా అన్నారు. గురువారం మండలంలోని కాసాల గ్రామాన్ని సందర్శించారు. అనంతరం గ్రామ పంచాయతీ రికార్డు, పల్లె ప్రకృతివనం, డంపింగ్ యార్డును పరిశీలించారు. హత్నూర మండలంలో 50 శాతం పన్ను వసూలు పూర్తి చేసినట్లు తెలిపారు. మరింత వేగవంతం చేసి 100% పూర్తి చేయాలన్నారు. నర్సరీల్లో మొక్కలు పెంచేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఈఓ యూసుఫ్, గ్రామపంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

పెన్షన్ గడువు 31 వరకు పొడిగింపు

పటాన్‌చెరు టౌన్: అధిక పెన్షన్ కోసం దరఖాస్తులను ఈపీఎఫ్ఓకు సమర్పించడానికి గడువును జనవరి 31 వరకు పొడిగించినట్లు రీజినల్ పీఎఫ్ కమిషనర్ విశాల్ అగర్వాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫార్వార్డ్ చేయని దరఖాస్తులు, స్పష్టత కోసం తిరిగి పంపిన దరఖాస్తులు 31లోగా సమర్పించాలన్నారు.

బీజేపీ జహీరాబాద్ పట్టణ అధ్యక్షుడిగా సంతోష్

జహీరాబాద్: జహీరాబాద్ పట్టణ బీజేపీ అధ్యక్షుడిగా పూల సంతోష్‌ను నియమించారు. గురువారం ఈ మేరకు పార్టీ అధిష్టానం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతను అప్పగించినందుకు క్రమశిక్షణతో కట్టుబడి ఉంటానన్నారు. నియామకానికి పాటు పడిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ సమైక్యత శిబిరానికి విద్యార్థి ఎంపిక



ప్రజ్వల

జహీరాబాద్ టౌన్: కర్నాటకలోని గుల్బర్గా పట్టణంలో 15 నుంచి ప్రారంభంకానున్న జాతీయ సమైక్యత శిబిరానికి ఉస్మానియా విద్యాలయం తరపున ఆచార్య డిగ్రీ కళాశాల విద్యార్థి పజ్వల ఎంపికయిందని ప్రిన్సిపాల్ హరికుమార్ తెలిపారు. ఏడు రోజుల కొనసాగే శిబిరంలో అనేక రాష్ట్రా ల నుంచి ఎన్ఎస్ఎస్ వలంటీర్లు హాజరవుతా రని చెప్పారు. దేశ సమైక్యతను చాటిచెప్పే సా ంస్కృతి కార్యక్రమాలు, యువత పాత్ర గురించి వివరిస్తారన్నారు. ప్రజ్వల ఎంపికపై ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి నందుగౌడ్ అభినందించారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి అన్నారు. గురువారం పటాన్‌చెరులోని శ్రీచైతన్య సీబీఎస్ హైస్కూల్‌లో స్కూల్ డైరెక్టర్ నరసింహ ఆధ్వర్యంలో నిర్వహించిన 32వ వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రవీందర్ రెడ్డి హాజరయ్యారు. డీఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో పాటు అన్ని రకాల క్రీడల్లో రాణించాలన్నారు. శ్రద్ధపెట్టి చదివితే తర్వాత ఐఏఎస్, ఐపీఎస్, ఇంజనీర్, తదితర ఉన్నతమైన ఉద్యోగాల్లో స్థిరపడడానికి అవకాశాలు ఉంటాయని తెలిపారు. విద్యార్థులు సెల్ ఫోన్‌కు దూరంగా ఉండాలన్నారు. స్కూల్ టాపర్ హర్షవర్ధన్, అమీర్, మేరాజ్ విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పటాన్‌చెరు, రామచంద్రాపురం ఎంఈఓలు నాగేశ్వరరావు, పీపీ రాథోడ్, శ్రీ చైతన్య సీబీఎస్ హైస్కూల్ డైరెక్టర్ నరసింహ, సొసైటీ ప్రెసిడెంట్ కె.విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ సీబీఎస్ వినయ శ్రీ, కోడైరెక్టర్ కె. సాయివినయ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్ రెడ్డి

ఘనంగా చౌడమ్మ జాతర



చౌడమ్మ జాతరలో పాల్గొన్న జగ్గారెడ్డి

కంది (సంగారెడ్డి): మండలంలోని ఎర్దనూర్ శివారులోని చౌడమ్మ జాతర గురువారం ఘనంగా నిర్వహించారు. జాతరలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆంజనేయులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. జాతరకు ఆయా గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

రోజూ పాఠశాలకు రావాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

మునిపల్లి(అందోల్): ప్రతి విద్యార్థి రోజు పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలను శ్రద్ధగా వినాలని ఎంపీడీఓ హరినందన్‌రావు కోరారు. గురువారం మండలంలోని లింగంపల్లి ప్రైమరీ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు వడిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సాయమ్మ, ఉపాధ్యాయులు అమినోద్దీన్, పంచాయతీ కార్యదర్శి షబ్బం, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నిబంధనలు తప్పనిసరి

మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ విజయరావు

పటాన్‌చెరు టౌన్: రోడ్డు భద్రత అందరి బాధ్యత అని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ విజయ రావు అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామ సమీపంలోని రవాణా శాఖ కార్యాలయ ఆవరణలో గురువారం వాహనదారులకు రోడ్డు భద్రతా నియమావళిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దని, వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, సీటుబెల్టు పెట్టుకొని ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. రోడ్లకు ఇరువైపులా ఏర్పాటు చేసిన సైనింగ్ బోర్డ్స్ సూచనలు, సలహాలు పాటిస్తూ సేఫ్టీగా డ్రైవింగ్ చేసి క్షేమంగా గమ్య స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. వాహనదారులు ప్రజలలో మార్పు వచ్చినప్పుడు మాత్రమే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని చెప్పారు. కార్యక్రమంలో వాహనదారులు, రవాణాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ విజయరావు

మార్కెట్ యార్డు స్థలం పరిశీలన

కంది(సంగారెడ్డి): మండల కేంద్రం కందిలోని మార్కెట్ యార్డు స్థలాన్ని గురువారం ఈఈ గణేష్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంచందర్‌నాయక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం కందిలో ప్రతి శనివారం రోడ్లపై సంత నిర్వహించడం వల్ల ప్రజలకు ఇబ్బందిగా ఉందన్నారు. గత 12 ఏళ్ల క్రితం గ్రామం మధ్యలో మార్కెట్ యార్డు కోసం 3ఎకరాల స్థలం కేటాయించి.. సౌకర్యాలు లేకపోవడంతో సంతను రోడ్లపై నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మార్కెట్ యార్డులో పూర్తిస్థాయి సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యాలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అధిక దిగుబడులు సాధించేలా కృషి

జహీరాబాద్: 'గ్రామీణవ్యవసాయ పని అనుభవం' కార్యక్రమంలో భాగంగా మల్లారెడ్డి యూనివర్శిటీ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు, రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జహీరాబాద్‌లోని కేవీకేలో నిర్వహించిన కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏ భిక్షపతి, కళాశాల డీన్ రాజారెడ్డి, చెరకు పరిశోధనా స్థానం శాస్త్రవేత్త ఫాతిమ మాట్లాడారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటలు వేసి, సాంకేతికను ఉపయోగించుకుని లాభాలు సాధించాలన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చేలా వ్యవసాయం చేయాలని సూచించారు. విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో డీడీఎస్ డీన్ దివ్య, కేవీకే శాస్త్రవేత్త వరప్రసాద్, ఏఓలు లావణ్య, హజీరొద్దీన్, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ భిక్షపతి

ముక్కోటి మురిసేలా..

- నేటి నుంచి వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు
- ఉత్తర ద్వారా దర్శనం
- భక్తులు దర్శించుకునేలా ఏర్పాట్లు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని వెంకటాపూర్ గ్రామ శివారులోని వెంకట చల దివ్య క్షేత్రం ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు సిద్ధమైంది. సూర్యుడు ఉత్తరాయణా నికి మారే ముందు వచ్చే ధనుర్మాస శుద్ధ ఏకాదశినే ముక్కోటి ఏకాదశి. నేటి రాత్రి భజనతో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈనెల 10న స్వామివారి ఉత్తర ద్వారా దర్శనానికి ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఉత్తర ద్వారం గుండా భక్తులుస్వామి వారిని దర్శించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఉదయం నాలుగు గంటలకు స్వామి వారికి సుప్రభాత సేవ, ఐదు గంటలకు గరుడ సేవ, వైకుంఠ ఉత్తర ముఖద్వారం చెంత అలంకార సేవలో స్వామివారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. అలాగే ఈనెల 12న ఉ.11గంటలకు గోదారంగనాథుల కల్యాణాన్ని నిర్వహించనున్నారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.



ముస్తాబైన ఆలయం

పటాన్‌చెరులో సామాజిక తనిఖీ

పటాన్‌చెరు టౌన్: మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం ఉపాధిహామీ 14 విడత సామాజిక తనిఖీని ప్రత్యేక బృందం నిర్వహించింది. పలుచోట్ల పనులు సక్రమంగా జరిగినా.. కొన్నిచోట్ల చిన్నపాటి అవకతవకలు బయటపడ్డాయి. వాటిని సరిదిద్ది సొమ్మును రికవరీ చేయాలని తెలంగాణ రూరల్ డెవలప్‌మెంట్ ఎస్ఎం అజయ్, స్టేట్ రిసోర్స్‌పర్సన్ బాలు, ఆడిట్ బృందం మండల బాధ్యులను తెలిపింది. ముత్తంగిలో జరిగిన పేమెంట్లలో తప్పులను గుర్తించారు. పేదలకు ఉపాధి కల్పించేలా సిబ్బంది పనిచేయడం లేదని బృందం అసహనం వ్యక్తం చేసింది. మండలంలోని పరిశ్రమల్లో, గృహనిర్మాణ రంగంలో కూలీలకు మంచి డిమాండ్ ఉండటంతో కూలీలు ఉపాధిహామీని సద్వినియోగం చేసుకోవడం లేదని పటాన్‌చెరు ఎంపీడీఓ యాదగిరి అన్నారు. రూ.1 కోటి 14 లక్షల వర్క్‌లు మాత్రమే జరిగాయన్నారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ అధికారి శ్రీలత, విజిలెన్స్ అధికారి నాగేశ్వర్‌రావు, ఎంపీఓ హరిశంకర్ గౌడ్, కార్యదర్శులు రాజ్‌కుమార్, రాజేందర్, పద్మ, సుభాష్, అనిత, కవిత, రవికుమార్, నర్సింహ్మారెడ్డి, నరేశ్, మౌనిక, రామకృష్ణ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



సామాజిక తనిఖీల్లో పాల్గొన్న అధికారులు

యువజన క్రీడాపోటీలు ప్రారంభం

సదాశివపేట(సంగారెడ్డి): విద్యార్థిని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి పథకాలు సాధించాలని ప్రినిపాల్ బంగ్లా భారతి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నేహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో యువజన క్రీడాపోటీలు ప్రారంభించారు.. కబడ్డీ, షటిల్, వాలీబాల్, రన్నింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు క్రీడాపోటీలు ఫిజికల్ ఫిట్నెస్ సాధించడానికి ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సిద్దులు, అధ్యాపకులు మురళీకృష్ణ, సర్వయ్య, రాంరెడ్డి, శకుంతల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్లు పోయినవి

శ్రీమతి దవల శ్రీలత నాగ, భర్త శ్రీ దవల పవన్ బాలాజీ, విల్లా నం.38, ఇన్ఫినిటీ హోమ్స్, తెల్లాపూర్ సమీపాన, HUDA లేఔట్, తెల్లాపూర్, R.C. పురం మండలం, సంగారెడ్డి జిల్లా వాసినైన నేను సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్, సంగారెడ్డి జిల్లాలో నమోదైన నా యొక్క ఒరిజినల్ డాక్యుమెంట్ నం.10148/2003, 10149/2003, తేది: 28-10-2003లను పటాన్‌చెరువు నుండి BHEL క్రాస్ రోడ్స్‌కు వెళుతుండగా 16-12-2024న సుమారు 1.00 గంటకు పోగొట్టుకున్నాను. ఎంత వెతికినా దొరకలేదు. ఎవరికైనా దొరికినచో సంప్రదించగలరు. సెల్: 9989774401

న్యాయం జరిగే వరకు పోరాటం

ప్రభుత్వం స్పందించాలని గిరిజనుల డిమాండ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధి వెలిమెల తండాలోని గిరిజన రైతులు తమ భూములు తమకు కావాలంటూ గురువారం ఆందోళన చేపట్టారు. పోలీసు రైతులను అడ్డుకునే ప్రయత్నం చేయగా గిరిజన మహిళలు వారిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. తమ తాతల కాలం నుంచి ఇక్కడి భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. కోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ అధికారులు న్యాయం చేయలేదని వాపోయారు. తమకు అన్యాయం జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయం జాతీయ ఎస్టీ కమిషన్ దృష్టికి తెలిపామన్నారు. భూములు వచ్చే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ అధికారులు బడాబాబులకు వత్తసు పలుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



పోలీసులను అడ్డుకున్న మహిళలు

వైకుంఠపురానికి భారీ పాదయాత్ర

సంగారెడ్డి: వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రం చౌటకూర్ నుంచి భక్తులు గురువారం పాదయాత్ర నిర్వహించారు. సంగారెడ్డి పట్టణ శివారు ప్రాంతంలో వెలసిన శ్రీమహాలక్ష్మీ గోదాసమేత శ్రీ విరాట్ వేంకటేశ్వరస్వామి దివ్యక్షేత్రం (శ్రీ వైకుంఠపురం)కు మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఎడ్లబండ్ల ఊరేగింపుతో పాదయాత్రగా తరలివెళ్లారు. ముందుగా చౌటకూర్‌లోని శ్రీ అన్నపూర్ణ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. సీడీసీ మాజీ చైర్మన్ భూంరెడ్డి సుబ్బారెడ్డి జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. అనంతరం మండలంలోని సరాఫ్పల్లి, సుల్తాన్పూర్, కోర్పోలు, ఉప్పరగూడెం, బద్రిగూడెం. శేరిరాంరెడ్డిగూడెం, శివంపేట, చక్రియాల తదితర గ్రామాల స్టేజీల వద్ద పాదయాత్రకు స్వాగతం పలికి భక్తులు వారి వెంట నడిచారు. బలరామకృష్ణుల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. 161 జాతీయ రహదారి పొడవున పాదయాత్రకు ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా దాతలు భక్తులకు పండ్లు, అన్నదానం చేశారు. కార్యక్రమంలో దశరథ్, శ్రీనివాస్ రెడ్డి , చందాపురం ముకుందం, భక్తులు పాల్గొన్నారు.



ఎడ్లబండ్లతో ఊరేగింపు వెళ్తున్న భక్తులు

నట్టల నివారణ మందు పంపిణీ

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండల పరిధిలోని నాగ్సాన్ పల్లి గ్రామంలో గురువారం దూడలకు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. అలాగే, పాడి రైతులకు పాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పశువుల సంరక్షణపై పశువైద్యాధికారులు పాడి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం పశువైద్యాధికారి సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. ఆవులు, గేదెలు వ్యాధు ల బారిన పడకుండా చూసుకోవాలని.. గర్భకోశ వ్యాధులకు తగిన చికిత్సలు అందించనున్నట్లు తెలిపారు. ప్రతి పశువుకు అన్ని రకాల టీకాలు వేసుకోవాలని, సమీకృత దాణా వాడి ఎక్కువ పాలు దిగుబడి పొందాలని సూచించారు. పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్సలు, కృత్రిమ గర్భధారణ, చికిత్సలు చేయించాలని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ సీఎం సహాయనిధి చెక్కు అందజేత

నారాయణఖేడ్: రాయికోడు గ్రామానికి చెందిన అరుణజ్యోతికి సీఎం సహాయనిధి నుంచి ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం రూ.16,500 మంజూరయింది. సంబంధించిన చెక్కును గురువారం ఖేడ్‌లోని ఎమ్మెల్యే డా.పటోళ్ల సంజీవరెడ్డి స్వగృహంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు సుధాకర్ రెడ్డి అందజేశారు. మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి, నాయకులు బాబు రావు, విష్ణువర్ధన్‌రెడ్డి, విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ బీజేపీ మండల అధ్యక్షుడిగా దుర్గయ్య

జహీరాబాద్ టౌన్: బీజేపీ జహీరాబాద్ మండల అధ్యక్షుడిగా మర్పల్లి గొల్ల దుర్గయ్య నియమితులైయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షురాలు గోదావరి ఉత్తర్వులు జారీ చేశారు. కోహీర్ మండల అధ్యక్షుడిగా టి.వైద్యనాథ్, జహీరాబాద్ టౌన్1 పూల సంతోష్, జహీరాబాద్ టౌన్ 2 అధ్యక్షుడిగా రమేష్‌రెడ్డి, ఝరాసంగం మండల అధ్యక్షుడిగా బంటు విశ్వనాథ్, న్యాల్‌కల్ మండల అధ్యక్షుడిగా గంగ్వార్ మల్లేశ్‌లు ఎన్నికయ్యారు.

◆ బీజేపీ సదాశివపేట మండల అధ్యక్షుడిగా ఆదిత్య

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): సదాశివపేట మండల బీజేపీ అధ్యక్షుడిగా అంకేనపల్లికి చెందిన కరణం ఆదిత్య నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ఆ పార్టీ జిల్లా సంస్థాగత ఎన్నికల అధికారి శాంతికుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

◆ క్రీడలతో మానసికోల్లాసం

నారాయణఖేడ్: క్రీడలతో మానసికోల్లాసం కల్గుతోందని ఖేడ్ మండలం జూకల్ ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.జి. నారాయణ అన్నారు. సంగారెడ్డి నెహ్రూ యు వకేంద్రం ఆధ్వర్యంలో గురువారం విద్యార్థినీ విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, పరుగుపందెం, టెన్నికాయిట్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తమకు నచ్చిన క్రీడల్లో నైపుణ్యం సాధించాలని సూచించారు. క్రీడలు ముగిసిన అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కళాశాల క్రీడల ఇన్‌చార్జి పోశెట్టి, ఎన్ఎస్ఎస్ యూనిట్ సమన్వయకర్తలు పాల్గొన్నారు.

ధనసిరి పాఠశాలలో మాక్ పోలింగ్

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలం ధనసరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ, పోలింగ్, ఈవీఎం, బ్యాలెట్ ఓటింగ్, కౌంటింగ్ విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్ఎం రమేష్ కుమార్ పర్యవేక్షణలో మాక్ పోలింగ్ నిర్వహించారు. మొత్తం ప్రక్రియ నిజమైన ఎన్నికలాగే నిర్వహించారు. ఎమెల్యే పదవికి నామినేషన్లు, నామినేషన్ల తిరస్కరణ, విత్‌డ్రా పోటీలో నిలిచిన వారికి గుర్తులు కేటాయించి పోలింగ్ నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థులంతా ఓటు వేశారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.

◆ టిప్పర్ స్వాధీనం

జిన్నారం (పటాన్‌చెరు: అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్‌కు రెవెన్యూ అధికారులు జరిమానా విధించారు. గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామ శివారులో అనుమతులు లేకుండా అక్రమంగా టిప్పర్‌తో మట్టి తరలిస్తున్న టిప్పర్‌కు తహసీల్దార్ గంగాభవాని రూ.10 వేలు జరిమానా విధించారు. పట్టుబడిన టిప్పర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వభూముల నుంచి మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

◆ 26న సైన్స్ ఫెయిర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఈనెల 26న తెల్లాపూర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెల్లాపూర్‌లో సైన్స్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు ఈశ్వర్‌గారి రమణ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గణతంత్ర వేడుకల్లో భాగంగా సైన్స్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 20 వరకు దరఖాస్తు సమర్పించాలని కోరారు.

◆ విద్యార్థులకు బహుమతుల ప్రదానం

న్యాల్‌కల్(జహీరాబాద్): అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకొని ప్రయోజనం పొందాలని ఎంఈఓ మారుతి రాథోడ్ అన్నారు. స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో నేషనల్ హుమెన్ రైట్స్ సోషల్ జస్టిస్ కమిషన్ ఆధ్వర్యంలో బుధవారం బాలికలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబర్చిన బాలికలకు ఎంఈఓ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నేషనల్ హుమెన్ రైట్స్ సోషల్ జస్టిస్ కమిషన్ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ రహీం, కార్యదర్శి మహమ్మద్‌గౌస్, జిల్లా అధ్యక్షుడు కృష్ణ, ఖేడ్ డివిజన్ అధ్యక్షుడు నర్సింహులు పాల్గొన్నారు.

◆ నేడు ఓపెన్ టు ఆల్ టోర్నమెంట్ ప్రారంభం

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండల కేంద్రంలో నేడు స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని సీజీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఓపెన్ టు ఆల్ క్రీడాపోటీలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు ట్రస్ట్ సభ్యులు సర్వం సిద్ధం చేశారు. పోటీలను రాత్రి వేళలో కూడా నిర్వహిస్తుడటంతో ప్రత్యేకంగా ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేశారు. కబడ్డీ, వాలీబాల్ పోటీలను నిర్వహించేందుకు ప్రాథమిక పాఠశాల మైదానాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడాకారుల్లో నైపుణ్యాలను వెలికి తీసే ప్రయత్నంలో భాగంగానే పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

◆ నిర్లక్ష్య డ్రైవింగ్‌తో ప్రాణాలు తీసుకోవద్దు

సంగారెడ్డి క్రైమ్: జాతీయ రహదారుల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పట్టణ టౌన్ ఎస్ఐ నర్సింలు పేర్కొన్నారు. పట్టణంలోని సెయింట్ పీటర్స్ పాఠశాలల్లో జాతీయ రహదారుల భద్రత మాసోత్సవాల సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. నిర్లక్ష్య డ్రైవింగ్ వల్ల ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని, ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, సీట్ బెల్ట్ పెట్టుకోకుండా డ్రైవింగ్ చేసి ఇతరుల ప్రాణాలకు హాని కల్గించొద్దని సూచించారు. కార్యక్రమంలో సెయింట్ పీటర్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆంథోనిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ పేద యువతి పెళ్లికి ఆర్థిక సాయం



జహీరాబాద్ టౌన్: గుమస్తా కూతురు పెళ్లికి ఆరు లక్షల ఆర్థిక సహాయం అందించి పెద్ద మనసు చాటుకున్నారు. పట్టణానికి చెందిన ప్రభాకర్ గుప్తా కుటుంబం పట్టణంలోని సుభాష్‌గంజ్‌లో గ్రీన్‌మార్చెంట్ వ్యాపారం ఉంది. పట్టణంలోని హమాలీకాలనీ చెందిన బషీర్ కొన్ని సంవత్సరాల నుంచి ప్రభాకర్ వద్ద గుమస్తాగా పనిచేస్తున్నాడు. నమ్మకంగా ఉంటూ యజమాని కుటుంబ సభ్యులకు చేదోడు, వాదోడుగా ఉంటున్నాడు. అయితే బషీర్ కూతురు హర్షబేగం వివాహం కుదిరింది. పేదరికం వల్ల పెళ్లి చేయడానికి ఆయన ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రభాకర్ గుప్తా రూ.6 లక్షల ఆర్థికసాయం అందజేశారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. చంద్రారెడ్డి -9912220353
కె. సంగారెడ్డి -9010294400